E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :45 గురువారం 16 జూలై 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



2 లో

- 7 కీలక నిర్ణయాలకు ఆమోదం
- సెమికాన్ 2.0కు రూ.1.27 లక్షల కోట్లు
- మొబైల్ పీఎల్ఐ రెండో విడతకు గ్రీన్ సిగ్నల్
- వారణాసి ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం
- రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణకు భారీ ప్రణాళిక

## అమల్లోకి భారత్ - యూకే ఫ్రీ ట్రేడ్ డీల్



2 లో

- 99% ఎగుమతులకు జీరో డ్యూటీ
- భారతీయ ఉత్పత్తులకు భారీ ఊతం
- ఐటీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్
- సోషల్ సెక్యూరిటీలో భారీ ఊరట
- లగ్జరీ కార్ల ధరలు తగ్గనున్నాయి
- ద్వైపాక్షిక వాణిజ్యానికి కొత్త ఊపు

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** భారత్ – బ్రిటన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేటి నుండి అధికారికంగా అమల్లోకి వచ్చింది. ఇటీవల జరిగిన జీ7 సదస్సులో భాగంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ జరిపిన ద్వైపాక్షిక భేటీ అనంతరం ఈ ఒప్పందానికి సంబంధించిన తుది ఆమోదం లభించింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సరికొత్త గరిష్ఠాలకు చేరుకోవడమే కాకుండా, ఎగుమతి–దిగుమతి సుంకాలు భారీగా తగ్గనున్నాయి. అలాగే రెండు దేశాల మధ్య ట్రేడ్ వాల్యూ 2030 నాటికి 56 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచడమే ఈ ఒప్పందం మరో కీలక లక్ష్యం కూడా.

## అద్దంకి, బల్మూరికి మంత్రి హోదా

- ప్రభుత్వ విప్‌లకు కీలక గుర్తింపు
- ప్రోటోకాల్ అమలుకు ఆదేశాలు
- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- కాంగ్రెస్ సేవలకు గుర్తింపు
- భవిష్యత్ నాయకులకు ప్రోత్సాహం
- పదవీకాలమంతా మంత్రి హోదా

2 లో

## "ప్రభుత్వ లాంఛనాలు అక్కర్లేదు" ముద్రగడ ఫ్యామిలీ

- కిర్లంపూడిలో అంతిమయాత్ర
- వ్యక్తిగతంగా అంత్యక్రియల నిర్వహణ
- ముద్రగడకు నివాళుల వెల్లువ
- జక్కంపూడి రాజా కీలక వ్యాఖ్యలు
- కూతురుకు దక్కని కడచూపు
- విషాదంలో కిర్లంపూడి



2 లో

## సీఈవో పోస్టుకు భారీ స్పందన

- 24 గంటల్లోనే 1,000 దరఖాస్తులు
- రామాలయ సీఈవో పోస్టుకు భారీ పోటీ
- జూలై 18తో దరఖాస్తుల గడువు
- జూలై 19న ఎంపిక కమిటీ సమావేశం
- 20 ఏళ్ల అనుభవం తప్పనిసరి
- జూలై 22న ట్రస్ట్‌కు ప్రగతి నివేదిక

## భారత్‌కు ఊరట

### భారీగా టారిఫ్‌లు తగ్గించిన రష్యా

- 500% నుంచి 100%కు సుంకాల తగ్గింపు
- రష్యా ఇంధన దిగుమతిదారులకు ఊరట
- రష్యా బ్యాంకులు, షాడో ఫ్లీట్‌పై ఆంక్షలు
- ట్రంప్‌కు ప్రత్యేక మినహాయింపు అధికారాలు
- అమెరికా కొత్త ఆంక్షల బిల్లు సంచలనం

2 లో

## ఫారాల నత్తనడక



- 49.28 శాతం మాత్రమే సమర్పణ
- పది రోజుల్లో పూర్తి సాధ్యమేనా?
- ఫారం ఇస్తేనే ఓటు హక్కు
- సీఈవో కీలక హెచ్చరిక జారీ
- హైదరాబాద్‌లో అత్యల్ప స్పందన
- మేడ్చల్‌లో కేవలం 18 శాతం
- గడువు పెంపుపై ఉత్కంఠ కొనసాగింపు
- బీఎల్ఓలకు వెంటనే ఫారాలు ఇవ్వండి

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రాష్ట్రంలో ఎస్ఐఆర్ కొనసాగుతోంది. అయితే మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు గాను 3,38,21,554 మందికి(99.99శాతం)ఎన్నికల అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. కానీ తిరిగి బీఎల్ఓలకు అందజేసే కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు 1,66,70,610మంది ఓటర్లు మాత్రమే (49.28శాతం) తమ ఫారాలను అందజేశారు. దీంతో మరో 50శాతం మంది ఓటర్లు పది రోజుల్లో ఇవ్వడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ గడువు పెంచాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

**49.2 శాతం మాత్రమే..**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాలను 49.2శాతం మంది ఓటర్లు మాత్రమే బీఎల్ఓలకు అందజేశారు. కొమురం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, నల్లగొండ, యాదాద్రి–భువనగిరి జిల్లాల్లో మాత్రమే 70శాతానికిపైగా ఓటర్లు తిరిగి ఫారాలను అందజేశారు. నిర్మల్, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మెదక్, జోగులాంబ గద్వాల, జనగాం, ఖమ్మం, నారాయణపేట్ జిల్లాల్లో 60శాతానికిపైగా మంది ఇచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 33శాతం, హైదరాబాద్ జిల్లా 22 శాతం, అత్యల్పంగా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో 18శాతం మంది మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేశారు. అయితే ఇప్పటివరకు వచ్చిన ఫారాల్లో మరణించిన ఓట్లు, వేరేప్రాంతాలకు చెందిన ఓటర్లు మాత్రమే అందజేసినట్టు తెలుస్తోంది.

మిగతాది 2 లో..

## డెల్టాకు జీవనాడిగా పట్టిసీమ

- పట్టిసీమపై చంద్రబాబు ప్రశంసలు
- 450 టీఎంసీల గోదావరి జలాల తరలింపు
- నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు
- అమరావతి అభివృద్ధిపై స్పష్టత
- రాయలసీమకు పటిష్ట నీటి ప్రణాళిక




2 లో

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని కృష్ణా–గోదావరి పవిత్ర సంగమ క్షేత్రం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, నదీమతల్లులకు జలహారతి ఇచ్చారు. అనంతరం సాగునీటి రంగానికి విశేష సేవలు అందించిన ప్రముఖ ఇంజనీర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంజనీరుగా కేఎల్ రావు అందించిన స్ఫూర్తిని రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

## 23 పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపు

- కమిషనర్ కృష్ణతేజ అభినందనలు
- పారదర్శక పాలనకు అంతర్జాతీయ గుర్తింపు
- నాణ్యమైన సేవలకు ఐఎస్‌వో సర్టిఫికేషన్
- కేరళ తరహాలో పంచాయతీరాజ్ లక్ష్యం



## ఉద్యమానికి సిద్ధం

- ఆక్వా రైతులతో జగన్ సమావేశం
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- సిండికేట్‌పై జగన్ ఆరోపణలు
- 'అప్పుడా'ను గుర్తు చేసిన జగన్



2 లో

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోందని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఆక్వా రైతులు, రైతు ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వంపై ఆయన తీవ్రమైన విమర్శలు చేశారు. అక్వా రైతులు దీనావస్థలో ఉన్నా ప్రభుత్వానికి 'దున్నపోతు మీద వాన పడినట్టు' ఉందని జగన్ మండిపడ్డారు. దాదాపు ఐదు లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని జగన్ ఆరోపించారు.

సిండికేట్‌గా చంద్రబాబు నాయుడి సానుభూతిపరులు

సీఎం చంద్రబాబు నాయుడి సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని జగన్ విమర్శించారు.

## డిశ్చార్జ్ అయిన పవన్ కళ్యాణ్



2 లో

- భుజాల శస్త్రచికిత్స విజయవంతం
- మరికొన్ని రోజులు పూర్తి విశ్రాంతి
- త్వరగా కోలుకోవాలని చంద్రబాబు ఆకాంక్ష
- 'వెల్‌కమ్ బ్యాక్' అంటూ అభిమానుల సందడి
- త్వరలో ప్రజాక్షేత్రంలోకి పవన్ రీఎంట్రీ

## అమల్లోకి భారత్ - యూకే ఫ్రీ ట్రేడ్ డీల్..

మొదటి పేజీ తరువాయి

భారతీయ ఎగుమతులపై 'జీరో డ్యూటీ'

ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం నుండి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే 99% పైగా వస్తువులపై యూకే ప్రభుత్వం పూర్తి సుంకం రాయితీ కల్పించింది. దీనివల్ల యూకే మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు గణనీయంగా తగ్గి, చైనా మరియు ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీ పడేలా మన ఎగుమతులు పెరగనున్నాయి. ప్రధానంగా టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ లోని భారతీయ చేనేత, వస్త్ర రంగానికి భారీ ఊతం లభిస్తుంది. తోలు వస్తువుల ఎగుమతులు పుంజుకుంటాయి. రత్నాలు, ఆభరణాల రంగానికి సరికొత్త మార్కెట్ లభిస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతి సులభతరం అవుతుంది. సముద్ర ఆహార ఉత్పత్తులు, ప్యాక్డ్ ఫుడ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది.

సర్వీసెస్ సెక్టర్, 'సోషల్ సెక్యూరిటీ' నిబంధన

కేవలం వస్తువుల మార్పిడి మాత్రమే కాకుండా, సేవల రంగంలో ఈ ఒప్పందం భారతీయులకు పెద్ద ఊరటనిచ్చింది. ఐటీ నిపుణులు, ఇంజనీర్లు, డాక్టర్లు, ఇతర నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్‌కు బ్రిటన్‌లో ఉపాధి అవకాశాలు సులభతరం అవుతాయి. సోషల్ సెక్యూరిటీ అగ్రిమెంట్ ప్రకారం యూకేలో తాత్కాలిక ప్రాజెక్టుల కోసం పని చేసే భారతీయ ఉద్యోగులు 5 సంవత్సరాల వరకు డబుల్ సోషల్ సెక్యూరిటీ కంట్రిబ్యూషన్ అంటే రెండు దేశాల్లోనూ చెల్లించే సామాజిక భద్రతా పన్నులు ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదు. దీనివల్ల భారతీయ కంపెనీలకు, ఉద్యోగులకు భారీగా ఖర్చు తగ్గుతుంది.

ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి?

బ్రిటన్ నుండి భారతదేశానికి దిగుమతి అయ్యే వస్తువుల పన్నులలో మార్పులు చేయడం వల్ల భారతీయ మార్కెట్లో ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. పరిశ్రమల్లో వాడే అత్యాధునిక బ్రిటీష్ యంత్రాల, వాటి విడి భాగాల ధరలు తగ్గుతాయి. బ్రిటన్ నుండి వచ్చే లగ్జరీ కార్లు, ఇతర వాహనాల ధరలు భారీగా తగ్గనున్నాయి. యూకేకు చెందిన బ్రాండెడ్ ఆహార పదార్థాలు, చాక్లెట్లు, పండ్ల ధరలు దిగివస్తాయి.

## డెల్టాకు జీవనాడిగా పట్టిసీమ

మొదటి పేజీ తరువాయి

డెల్టాను సస్యశ్యామలం చేసింది ఆయనే..

దేశంలో శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ వంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారని సీఎం చంద్రబాబు కొనియాడారు. విజయవాడలో పుట్టి, ఎంపీగా గెలిచి, ముగ్గురు ప్రధానమంత్రుల వద్ద కేంద్రమంత్రిగా పనిచేసిన ఆయన.. ఐక్యరాజ్యసమితి తరపున అంతర్జాతీయ జల నిపుణుడిగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలు అందించారని గుర్తుచేశారు. నాడు సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీలను నిర్మిస్తే, కేఎల్ రావు వాటిని ఆధునీకరించి డెల్టాను సస్యశ్యామలం చేశారన్నారు. శివరామకృష్ణయ్య, కేఎల్ రావుల తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని, సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా తనకు ఎంతో స్ఫూర్తినిచ్చారని సీఎం పేర్కొన్నారు.

పట్టిసీమ రాకపోయుంటే..

శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు కృష్ణా నది నుంచి నీటి ప్రవాహం తగ్గి పంట సీజన్ మారిపోతున్న తరుణంలో, రైతులు తుపాన్ల బారిన పడి నష్టపోకుండా రక్షించాలనే ఉద్దేశంతోనే తాము పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నాడు పట్టిసీమను కొందరు వట్టిసీమ అని అవహేళన చేశారని, ప్రాజెక్టు దండగ అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే 2014లో విభజన తర్వాత తాము బస్సులోనే బస చేసి, పట్టుదలతో కేవలం 1300 కోట్ల రూపాయల ఖర్చుతో పట్టిసీమను పూర్తి చేశామని గుర్తుచేశారు. గడిచిన 2015 నుండి 2025 వరకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని, నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయని హర్షం వ్యక్తం చేశారు. ఏటా సగటున 2 వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో వృథాగా కలుస్తోందని, పట్టిసీమ నీరే రాకపోతే.. నేడు కృష్ణా డెల్టా పరిస్థితి ఏమిటో అందరూ ఆలోచించాలన్నారు.

సీమకోసం ప్రత్యేక చర్యలు

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాము హైటెక్ సిటీ నిర్మిస్తుంటే దండగ అన్నారని, కానీ తాము ధైర్యంగా ముందుకు వెళ్లబట్టే నేడు హైదరాబాద్ ఐటీకి అంతర్జాతీయ కేంద్రంగా నిలిచిందని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలోని కొందరు రాజకీయం కోసం రైతుల్ని రెచ్చగొట్టి చివరకు సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. దేశంలో నదుల అనుసంధానం జరిగితే అద్భుతమైన అవకాశాలు ఉంటాయని, గోదావరి-కావేరి అనుసంధానాన్ని కేఎల్ రావు నాడే ప్రతిపాదించగా, వాజపేయి హయాంలో గంగా-కావేరి అనుసంధానం కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం వాగులు, వంకలు, నీటి ఊటలు అడుగంటిపోతున్న తరుణంలో భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టామని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు.

## అద్దంకి, బల్మూరికి మంత్రి హోదా



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ విప్ లుగా ఉన్న ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ లకు రాష్ట్ర మంత్రి హోదా ఇచ్చింది. ఈ మేరకు అధికారులు ప్రోటోకాల్ పాటించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. ఏప్రిల్ లోనే అప్పటి సీఎస్ రామకృష్ణారావు పేరుతో జీవో రూపొందింది. అయితే అదే జీవోను తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అద్దంకి దయాకర్ పాత్ర చాలా కీలకమైంది.

అలాగే రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరు ఉంది. ఇటు బల్మూరి వెంకట్ విద్యార్థి నాయకుడిగా ప్రతిపక్షంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు అనేక పోరాటాలు చేశాడు. జైల్లో పడ్డాడు. కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టాడు. నిత్యం కాంగ్రెస్ కోసం పనిచేస్తూ, పార్టీని ముందుకు నడిపించాడు. ఈ క్రమంలోనే ఈ ఇద్దరు భవిష్యత్తు లీడర్లకు కేబినెట్ హోదా కల్పించింది రేవంత్ రెడ్డి సర్కార్. దీంతో పార్టీ కోసం కష్టపడ్డ వాళ్లకు పదవులు దక్కుతాయని కాంగ్రెస్ మరోసారి నిరూపించినట్లు కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. కాగా, ఎమ్మెల్సీ పూర్తి పదవీకాలం పాటు మంత్రి హోదా అమల్లో ఉంటుందని ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం.

## 23 పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపు

**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రాష్ట్రంలో 23 పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ సిబ్బందిని అభినందించారు. పంచాయతీల పాలనలో పారదర్శకత, నాణ్యమైన సేవలకు గుర్తింపు దక్కిందన్నారు. మెరుగైన రికార్డుల నిర్వహణ, త్వరితగతిన ధృవపత్రాల జారీకి గుర్తింపు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు లభించిన ఈ ఐఎస్‌వో సర్టిఫికేషన్, భవిష్యత్తులో మరింత మెరుగ్గా పనిచేసేందుకు ఒక గొప్ప ప్రోత్సాహకరంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని పంచాయతీరాజ్ శాఖను కేరళ తరహాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు కమిషనర్ కృష్ణతేజ ఈ సందర్భంగా వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పాలనను మరింత పటిష్టం చేసి, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఉద్యమానికి సిద్ధం

మొదటి పేజీ తరువాయి

ఈ సిండికేట్ చేతుల్లో ఆక్వా రైతులు నలిగిపోతున్నారని, ఫీడ్, సీడ్ ధరలను వారే ఇష్టానుసారంగా నిర్ణయిస్తున్నారని మండిపడ్డారు. ఫీడ్ ధరలను కేజీకి రూ.14 నుంచి రూ.16 వరకు పెంచేసి, కేవలం రూ.2 తగ్గించి చేతులు దులుపుకోవడం రైతులను అవమానించడమేనన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే ఇలాంటి సిండికేట్‌లకే పండగ అని, రైతన్నలకు మాత్రం కన్నీరే మిగులుతుందని జగన్ ఎద్దేవా చేశారు.


మా హయాంలో 'అప్సడా' ఏర్పాటు చేశాం

ఆక్వా రైతులకు అండగా ఉండేందుకు తమ హయాంలో 'అప్సడా' ను ఏర్పాటు చేశామని జగన్ గుర్తు చేశారు. తద్వారా సీడ్, ఫీడ్, మార్కెటింగ్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించామని ఆయన చెప్పారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రైతుల కోసం 35 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, ఆర్బీకేల పరిధిలో ఫిషరీస్ అసిస్టెంట్‌లను నియమించామని ఆయన తెలిపారు. నరసాపురంలో తాము తీసుకొచ్చిన ఫిషరీస్ వర్సిటీని, భీమవరంలో మెడికల్ కాలేజీ పనులను సైతం చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసిందని జగన్ ఆరోపించారు.

ఆక్వా రైతుల కష్టాలు నాకు తెలుసు

ఆక్వా రైతుల కష్టాలు తనకు తెలుసని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని జగన్ భరోసా ఇచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరఫున ఉద్యమబాట పడతామని ఆయన స్పష్టం చేశారు. మరో మూడేళ్లలో మళ్లీ రైతు ప్రభుత్వం వస్తుందని దీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు సిండికేట్‌ను కూకటివేళ్లతో పీకేస్తామని హెచ్చరించారు. మళ్లీ 'అప్సడా'కు పూర్వ వైభవం తీసుకువస్తామని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు.

## "ప్రభుత్వ లాంఛనాలు అక్కర్లేదు" : ముద్రగడ ఫ్యామిలీ



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** కాపు సామాజికవర్గ అగ్రనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలన్న ప్రతిపాదనను ఆయన కుటుంబ సభ్యులు తిరస్కరించారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ముద్రగడ కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని తుది వీడ్కోలు నిమిత్తం కాకినాడ జిల్లాలోని ఆయన స్వస్థలమైన కిర్లంపూడికి తరలించారు. అయితే ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ గౌరవ సూచికంగా అధికారిక లాంఛనాలతో జరుపుతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆయన కుటుంబం దీనికి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జక్కంపూడి రాజా మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించారు. ముద్రగడ పద్మనాభం బతికి ఉన్నంత కాలం రాజకీయంగా, వ్యక్తిగతంగా అనేక రకాలుగా వేధింపులకు గురిచేసి, అవమానించిన వారు.. ఇప్పుడు ఆయన మరణించాక లేని సానుభూతిని ప్రదర్శిస్తూ అధికారిక లాంఛనాలు అనడం తమకు ఎంతమాత్రం అవసరం లేదని కుటుంబ సభ్యులు స్పష్టం చేసినట్లు రాజా పేర్కొన్నారు. ముద్రగడ తన జీవితంలో ఎన్నడూ పదవుల కోసమో, తాత్కాలిక గొప్పల కోసమో పాకులాడలేదని, ప్రజా పక్షాన పోరాడిన నిఖార్సైన నేతగా నిలిచారని ఆయన కొనియాడారు.

కూతురుకు దక్కని కడచూపు

ఇదిలావుండగా కన్నతండ్రిని కడసారి చూసుకునేందుకు హైదరాబాద్ నుండి కిర్లంపూడికి తరలివచ్చిన ముద్రగడ కుమార్తె క్రాంతిశీలను ఆమె తల్లితో పాటు అక్కడ ఉన్న ముద్రగడ అభిమానులు, అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించారు. గతంలో తండ్రితో వచ్చిన విభేదాలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆగ్రహంతో ఉన్న కుటుంబ సభ్యులు ఆమెను అంత్యక్రియల ప్రాంగణంలోకి రాకుండా, భౌతికకాయాన్ని చూడకుండా గేట్ల వద్దే అడ్డుకుని వెనక్కి పంపించివేశారు. దశాబ్దాల పాటు కాపు రిజర్వేషన్ల పోరాటమే ఊపిరిగా బతికిన ఒక శకం ముగియడంతో కిర్లంపూడి పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు కేవలం సాంప్రదాయబద్ధంగా, వ్యక్తిగత పద్ధతిలోనే ఆయన అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ఫారాల నత్తనడక

మొదటి పేజీ తరువాయి



ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన ఓటర్లు ఓటెయ్యడంలోనూ, ఓటును కాపాడుకోవడంలోనూ వెనుకబడే ఉన్నారని విమర్శలూ లేకపోలేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో 14రోజుల పాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పొడిగించిన నేపథ్యంలో రాష్ట్రంలో పొడిగించే అవకాశాలు ఉన్నాయా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.

**ఫారం ఇస్తేనే ఓటు హక్కు : సీఈవో సి.సుదర్శన్‌రెడ్డి**

పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌ఓలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని, లేదంటే ఓటును తొలగించాల్సి వస్తుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫారాలను వెంటనే పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందజేయాలని ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి అందించాలని కోరారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయినా ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపాలని స్పష్టం చేశారు. 'సర్' ప్రక్రియ జూన్ 25న ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ముగుస్తుందని పేర్కొన్నారు.

# డిశ్చార్జ్ అయిన పవన్ కళ్యాణ్



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముంబైలోని ప్రసిద్ధ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి నుండి బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. గత కొంతకాలంగా భుజాల నొప్పితో బాధపడుతున్న ఆయన, తన రెండు భుజాలకు శస్త్రచికిత్స చేయించుకోవడం కోసం ఈనెల 10వ తేదీన ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు ఆసుపత్రిలోనే 4 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్న ఆయన, కోలుకోవడంతో వైద్యులు బుధవారం ఉదయం డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. అయితే, ఇంటికి వెళ్లిన తర్వాత కూడా మరికొన్ని రోజుల పాటు ఆయనకు పూర్తి బెడ్ రెస్ట్ అవసరమని వైద్య బృందం సూచించినట్లు సమాచారం.

కాగా పవన్ కళ్యాణ్ భుజాల సర్జరీ అనంతరం కోలుకుని, మళ్లీ మునుపటి ఉత్సాహంతో ప్రజాక్షేత్రంలోకి, ప్రజల మధ్యలోకి తిరిగి వస్తారు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారనే వార్తతో జనసేన శ్రేణులు, కూటమి నాయకులు, ఆయన అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా 'వెల్ కమ్ బ్యాక్' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా, మౌలిక వసతుల రంగాన్ని పరుగులు పెట్టించేలా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్, ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో మొత్తం 7 ప్రధాన నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. అందుక సంబంధించిన నిర్ణయాల వివరాలను కేంద్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ముందుకుగా వారణాసిలో సరికొత్త పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కేబినెట్ మొదటి రెండు నిర్ణయాల ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వరుణ నది ఒడ్డున ర్యాంప్‌లు, లూప్‌లతో కూడిన 43.218 కిలోమీటర్ల పొడవైన 6/4 లేన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఇక నేషన్ హైవే 31 ని, వారణాసి రింగ్ రోడ్‌తో లింక్ చేసే ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రూ.10,998.32 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్నారు.

గ్లోబల్ టెక్ హబ్‌గా భారత్ – సెమికాన్ 2.0, మొబైల్ పిఎల్ఐ

అదేవిధంగా సాంకేతిక రంగంలో దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు కేబినెట్ మరో మూడు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. సెమికాన్ మిషన్ 2.0లో భాగంగా దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'ఇండియా సెమికాన్ మిషన్' రెండో విడతకు కేబినెట్ ఏకంగా రూ.1.27 లక్షల కోట్లను మంజూరు చేసింది. ఇక దేశాన్ని మొబైల్ ఉత్పత్తి హబ్‌గా మార్చే లక్ష్యంతో, మొబైల్ ఫోన్ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) స్కీమ్ రెండో విడత కోసం రూ.62,500 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. ఎరువుల కొరత లేకుండా దేశాన్ని యూరియా ఉత్పత్తిలో స్వావలంబన వైపు నడిపించేందుకు నూతన 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా'కు ఆమోదముద్ర వేశారు.

రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణ..

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు కేబినెట్ ఆఖరి రెండు నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పలు ప్రధాన మార్గాల్లో రైల్వే ట్రాక్‌ల డబ్లింగ్, నాలుగో రైల్వే లైన్ నిర్మాణ పనులను భారీ ఎత్తున చేపట్టేందుకు ప్రతిపాదనలను ఆమోదించారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలతో దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం సరికొత్త పుంతలు తొక్కనుంది. మౌలిక వసతుల కల్పన, రైల్వేల ఆధునికీకరణతో పాటు సెమీ కండక్టర్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.


# సీఈవో పోస్టుకు భారీ స్పందన



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. అయోధ్య రామాలయ పరిపాలనా నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ వెలువడిన 24 గంటల్లోనే ఏకంగా 1,000కి పైగా దరఖాస్తులు రావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ దరఖాస్తుదారుల్లో అత్యధిక శాతం మంది విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండగా, మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ కూడా ఈ రేసులో ఉన్నట్లు స్వయంగా ధృవీకరించారు. దరఖాస్తు చేసుకోవడానికి జూలై 18 చివరి తేదీ కావడంతో, ఈ సంఖ్య మరికొన్ని వేలకు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. భారీ సంఖ్యలో వస్తున్న దరఖాస్తుల పరిశీలన, అభ్యర్థుల అర్హతల వెరిఫికేషన్ ప్రక్రియలో సహాయం అందించడం కోసం ఒక సెక్రటరీని నియమించాలని ఎంపిక కమిటీ నిర్ణయించింది.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) విష్ణుకాంత్ చతుర్వేది, శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ సురేష్ హావారేలతో కూడిన ఈ ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ జూలై 19న సమావేశమై దరఖాస్తులను సమీక్షించడంతో పాటు ఇంటర్వ్యూ ప్రక్రియను ఖరారు చేయనుంది. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 50 నుండి 70 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. పరిపాలనా రంగంలో కనీసం 20 ఏళ్ల అనుభవంతో పాటు అయోధ్యలోనే నివసించేందుకు సిద్ధంగా ఉండాలి. వీటితో పాటు వారు ఖచ్చితంగా హిందూ మతావలంబీకులై ఉండి, శ్రీరామునిపై అచంచల విశ్వాసం కలిగి ఉండాలని, హిందీ, ఇంగ్లీష్ భాషలపై మంచి పట్టు ఉండాలనే నిబంధనలను ట్రస్ట్ విధించింది. ప్రాథమిక స్క్రీనింగ్ అనంతరం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను నేరుగా లేదా అవసరమైతే ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలకు ఆహ్వానించనున్నారు. కాగా.. జూలై 22న జరగబోయే ఆలయ ట్రస్ట్ సమావేశంలో ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన ప్రగతి నివేదికను ఎంపిక కమిటీ సమర్పించే అవకాశం ఉంది.

## భారత్‌కు ఊరట.. భారీగా టారిఫ్‌లు తగ్గించిన రష్యా



**న్యూస్ డెస్క్, 15 జూలై (తెలుగు గళం):** రష్యాపై మరింత ఒత్తిడి పెంచేలా అమెరికా సెనేటర్లు సవరించిన సరికొత్త ఆంక్షల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. రష్యా నుంచి ముడి చమురు, గ్యాస్‌ను భారీగా దిగుమతి చేసుకుంటున్న భారత్, చైనాతో పాటు ఇతర దేశాలకు విధించాలనుకున్న భారీ టారిఫ్‌లను (సుంకాలను) ఈ కొత్త బిల్లులో గణనీయంగా తగ్గించడం గమనార్హం. దివంగత అమెరికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం రూపకల్పన చేసిన ఈ ద్వైపాక్షిక బిల్లు.. రష్యా ఆదాయ వనరులపై దెబ్బకొట్టడంతో పాటు రష్యా ఇంధనంపై ఆధారపడే దేశాలు ఆ దిగుమతులను తగ్గించుకునేలా ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకువచ్చారు.

టారిఫ్‌లు 500% నుండి 100% కి తగ్గింపు

ఈ సవరించిన ప్రతిపాదన ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలపై విధించే గరిష్ట సుంకాన్ని 100 శాతానికి తగ్గించారు. మునుపటి బిల్లులో దీనిని ఏకంగా 500 శాతంగా ప్రతిపాదించగా, ఇప్పుడు దానిని భారీగా తగ్గించడం భారత్ వంటి దేశాలకు పెద్ద ఉపశమనం కానుంది. రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ.. ఆ దిగుమతులను తగ్గించుకోవడానికి గణనీయమైన చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో ప్రత్యేక మినహాయింపు ఇచ్చారు. దీనివల్ల జపాన్, ఫ్రాన్స్, హంగేరి, బెల్జియం వంటి దేశాలకు ప్రయోజనం చేకూరనుంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం.. రష్యా క్రూడాయిల్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా, స్లోవేకియా, హంగేరి, అజర్‌బైజాన్ ఉన్నాయి. అలాగే రష్యా గ్యాస్‌ను ఎక్కువగా కొనుగోలు చేసే దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగేరి, బెల్జియం ముందువరుసలో ఉన్నాయి.

రష్యా 'షాడో ఫ్లీట్'.. బ్యాంకులపై గురి!

టారిఫ్‌ల తగ్గింపుతో ఇతర దేశాలకు ఊరటనిచ్చినప్పటికీ, రష్యాపై కఠిన చర్యలను మాత్రం ఈ బిల్లులో కొనసాగించారు. పాశ్చాత్య దేశాల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రష్యా రహస్య ఆయిల్ ట్యాంకర్ల వ్యవస్థ పై ఆంక్షలు విధించనున్నారు. రష్యా సెంట్రల్ బ్యాంక్‌తో సహా అక్కడి కీలక ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. రష్యాకు చెందిన ప్రతిష్టాత్మక ఇంధన ప్రాజెక్టులైన యామల్ ఎల్ఎన్‌జీ, ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 1, 2, 3 లపై గట్టి నిఘా ఉంచనున్నారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అవసరమని భావిస్తే.. రష్యాపై విధిస్తున్న ఆంక్షలను తాత్కాలికంగా నిలిపివేసే లేదా మినహాయింపులు ఇచ్చే విచక్షణాధికారాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ బిల్లు కల్పించింది. సౌత్ కరోలినా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమొక్రాటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ సంయుక్తంగా 2025 ఏప్రిల్‌లో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. ఇటీవల ఉక్రెయిన్ పర్యటనలో ఉన్నప్పుడు అధ్యక్షుడు ట్రంప్‌తో ఈ బిల్లుపై ఒప్పందం కుదిరిందని ప్రకటించిన మరుసటి రోజే లిండ్సే గ్రాహం ఆకస్మికంగా మరణించారు.

# భూ రీ-సర్వేలో తప్పులకు తావుండొద్దు: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం

**గణపురం శివారులో రీ-సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్**

**ఆధునిక 'రోవర్' సాంకేతికతతో పక్కాగా సరిహద్దుల గుర్తింపు**

**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం.. రైతులు సహకరించాలని పిలుపు**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం**

జిల్లాలో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా,అత్యంత పారదర్శకంగా పక్కాగా నిర్వహించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.బుధవారం గణపురం మండలం,గణపురం శివారు గ్రామాల పరిధిలో క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను ఆయన స్వయంగా పరిశీలించారు.సర్వేయర్లు సర్వే చేస్తున్న తీరును, రికార్డులలో వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ నిశితంగా తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ తనిఖీ సందర్భంగా సర్వే సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన 'రోవర్' పరికరం ద్వారా భూములను డిజిటల్ పద్ధతిలో సర్వే చేస్తున్న విధానాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూముల సరిహద్దులను పకడ్బందీగా గుర్తించి హద్దులు వేయాలని సూచించారు.ఈ విధానం ద్వారా భవిష్యత్తులో రైతులకు ఎలాంటి సరిహద్దు వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.భూ రీ-సర్వే ద్వారా రైతులకు తమ భూములపై పూర్తిస్థాయిలో చట్టబద్ధమైన హక్కులు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్క రైతు భూమి వివరాలు ఖచ్చితంగా ఆన్‌లైన్ రికార్డులలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి రైతులందరూ పూర్తిగా సహకరించాలని కోరారు. సర్వే జరిగే సమయంలో సంబంధిత రైతులతో పాటు పొరుగున (సరిహద్దులో) ఉన్న రైతులు కూడా క్షేత్రస్థాయిలో పాల్గొని హద్దులను ధ్రువీకరించుకోవాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్,గణపురం తహశీల్దార్ రాజేశ్వరరావు, మండల సర్వేయర్ తిరుపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో రెగ్యులర్ డీఈఓ,ఎంఈఓలను వెంటనే నియమించాలి:ఆప్ డిమాండ్

**ఇన్‌ఛార్జ్ పాలనతో గాడితప్పిన విద్యావ్యవస్థ:ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్**

**జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ) కి వినతిపత్రం సమర్పణ**



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విద్యాశాఖ అంతా ఇన్‌ఛార్జ్‌ల పాలనలోనే కొట్టుమిట్టాడుతోందని,దీనివల్ల జిల్లాలో విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాకు రెగ్యులర్ డీఈఓ ని,అలాగే అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓ లను తక్షణమే నియమించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి కి పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

తొమ్మిదేళ్లుగా ఇన్‌ఛార్జ్‌ల రాజ్యమేనా..?


అనంతరం నాగుల అరవింద్ మీడియాతో మాట్లాడుతూ.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పడి 9 ఏళ్లు దాటుతున్నా, ఇంతవరకు కేవలం ఒక్కరంటే ఒక్కరే రెగ్యులర్ డీఈఓగా పనిచేశారని, ఆ తర్వాత అంతా ఇన్‌ఛార్జ్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. డీఈఓ లాంటి కీలక పోస్టే ఇన్‌ఛార్జ్ పరిధిలో ఉంటే జిల్లాలో విద్యావ్యవస్థ ఎలా మెరుగుపడుతుందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.జిల్లాలోని అన్ని మండలాల్లోనూ రెగ్యులర్ ఎంఈఓలు లేకపోవడం దారుణమన్నారు.పాఠశాలల్లో పనిచేసే సీనియర్ ఉపాధ్యాయులకే ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అటు స్కూళ్లలో పాఠాలు చెప్పలేక, ఇటు మండల విద్యాశాఖను పర్యవేక్షించలేక రెండు వైపులా న్యాయం చేయలేకపోతున్నారని,ఫలితంగా విద్యావ్యవస్థ విచ్ఛిన్నమవుతోందని ఆరోపించారు.అధికారుల పూర్తిస్థాయి పర్యవేక్షణ లోపించడంతో ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. కనీస అర్హతల్లేని ఉపాధ్యాయులతో బోధన సాగిస్తూ, మౌలిక వసతులు లేకున్నా యథేచ్ఛగా నడుపుతున్నాయని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత తగ్గిపోతోందని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, మౌలిక వసతుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రెగ్యులర్ డీఈఓను, అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని, లేనిపక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోశాధికారి వాసాల శ్రావణ్ కుమార్, పట్టణ నాయకులు అజయ్,పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అధికారుల నిర్లక్ష్య ధోరణి నశించాలి:కేవీపీఎస్ వినూత్న నిరసన

**సమస్య అడిగితే సమాధానం బదులు అధికారుల ప్రశ్నలా..?**

**డిసెంబర్ నుండి తిరుగుతున్నా పరిష్కారం లేదు: కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్ ఆవేదన**

**భూపాలపల్లి కలెక్టరేట్‌లో పోస్టర్లు అతికించి నిరసన.. కలెక్టర్ జోక్యం కోరిన బాధితుడు**






**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం క్షేత్రస్థాయిలో బాధితులకు ప్రశ్నల పరంపరగా మారిందని కేవీపీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్ తీవ్ర ఆరోపణలు చేశారు.భూపాలపల్లి జిల్లా ప్రజావాణిలో అర్జీలు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాకపోగా,బాధితులను అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శిస్తూ.. మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పోస్టర్లు అతికించి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆత్కూరి శ్రీధర్ మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు న్యాయం జరుగుతుందనే ఆశతో వస్తున్న బాధితులను చూసి స్పందించాల్సిన జిల్లా అధికారులు, అందుకు భిన్నంగా "పదేపదే ఎందుకు వస్తున్నావ్..?", "ఎన్నిసార్లు వస్తావ్..?" అంటూ ఎదురు ప్రశ్నించడం అత్యంత బాధాకరమన్నారు.గత ఏడాది డిసెంబర్ నెల నుండి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజావాణిలో తన వ్యక్తిగత సమస్యపై పలుమార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ,ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ,జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగలేక చెప్పులు అరిగిపోయాయే తప్ప ఫైలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మండిపడ్డారు.బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉండి ప్రజలకు సేవ చేయాల్సిన భూపాలపల్లి జిల్లా అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఈ ఘటనలే నిదర్శనమని ఆరోపించారు.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటుంటే,మరోవైపు క్షేత్రస్థాయిలో జిల్లా అధికారులు బాధితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తనలాంటి ప్రజాసంఘాల నాయకుడి సమస్యకే భూపాలపల్లి జిల్లాలో నెలల తరబడి మోక్షం లభించకపోతే, ఇక సామాన్య ప్రజల గతి ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రజావాణి అనేది ప్రజల గొంతుకను వినిపించే నిఖార్సైన వేదిక కావాలే తప్ప,ప్రజలను విసిగించే కార్యాలయంగా మారకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని, జిల్లా ప్రజావాణిలో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని,ప్రజలను ఇబ్బంది పెడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆత్కూరి శ్రీధర్ డిమాండ్ చేశారు.

# ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం!

**చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అత్యంత అధునాతన వైద్యం అందుబాటులోకి**

**యశోద హాస్పిటల్స్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ వెల్లడి**




తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జులై 16, ఖమ్మం జిల్లా : యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ మాట్లాడుతూ తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో , ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' (కృత్రిమ గుండె – ఊపిరితిత్తుల పరికరం ) విధానం ఒక సంజీవనిలా మారుతోందని తెలిపారు . ఈ అత్యంత సంక్లిష్టమైన వైద్య విధానం యొక్క విశిష్టతను మరియు మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు . ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల్లోని రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుబాటులోకి వచ్చాయో వివరించడానికి , చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల్లో భరోసా నింపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు . ప్రాణం నిలిపే 'ఎక్మో' (కృత్రిమ శ్వాస వ్యవస్థ) విధానం చివరి దశ 'ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్' లేదా శ్వాసకోశ వైఫల్యం వల్ల ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్‌ను అందించే సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయినప్పుడు ఈ 'వెనో – వీనస్ ఎక్మో లైఫ్ సపోర్ట్ విధానాన్ని ఉపయోగిస్తామని అన్నారు . ఈ విధానంలో అత్యాధునిక యంత్రం శరీరం వెలుపల ఉంటూ కృత్రిమ ఊపిరితిత్తుల వ్యవస్థలా పనిచేస్తుంది . ఇది శరీరం నుండి ఆక్సిజన్ లేని చెడు రక్తాన్ని గ్రహించి దానికి పూర్తి ఆక్సిజన్‌ను అందించి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి మళ్లీ శరీరంలోకి పంపుతుంది . ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు , దాత దొరికేవరకు ప్రాణాలను నిలిపి ఉంచడానికి ఈ సాంకేతిక విధానం అత్యంత కీలకమైనదని డాక్టర్ తపస్వి వివరించారు . సెకన్ల సమన్వయంతో సాగే అవయవ మార్పిడి ఈ ఎక్మో విధానంలో ఉన్న రోగులకు ఊపిరితిత్తుల మార్పిడి చేయడం వైద్యశాస్త్రంలోనే అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ . రక్తం గడ్డకట్టడం , అధిక రక్తస్రావం వంటి తీవ్రమైన సాంకేతిక ప్రమాదాలను అధిగమిస్తూ.. గుండె – ఊపిరితిత్తుల నిపుణులు , అనస్థీషియా వైద్యులు , ఐసీయూ నర్సింగ్ బృందం సెకన్ల సమన్వయంతో వ్యవహరించి ఈ సుదీర్ఘ శస్త్రచికిత్స ప్రక్రియను విజయవంతం చేయాల్సి ఉంటుందని , ఊపిరితిత్తుల వ్యాధి చివరి దశకు చేరినంత మాత్రాన ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని , ఎక్మో వంటి అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన వైద్య విధానం ద్వారా ప్రాణాలు నిలపడం సాధ్యమేనని స్పష్టం చేశారు . విజయవంతమైన రికవరీ విధానం శస్త్రచికిత్స అనంతరం అందించే ప్రత్యేక అంతర్జాతీయ క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్ ద్వారా రోగులను ఎక్మో యంత్రం మరియు వెంటిలేటర్ల నుండి సురక్షితంగా తొలగించి , కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా చేస్తామని. ఆ తర్వాత క్రియాశీల శారీరక వ్యాయామాల ప్రక్రియ (రిహాబిలిటేషన్) ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా ఈ చికిత్సా విధానం తోడ్పడుతుందని డాక్టర్ తపస్వి వివరించారు . ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ మేనేజర్ పరమేష్ , అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు .

# యాదవుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించం"

**ఈశ్వరమ్మ యాదవ్‌కు శివ చరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి: నూనె హరిబాబు యాదవ్"**



**సత్తుపల్లి/వేంసూరు,జులై 15 (తెలుగుగళం)న్యూస్:**

యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఈశ్వరమ్మ యాదవ్‌పై రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు శివ చరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీసీ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె హరిబాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు.


రాజకీయాల్లో భేదాభిప్రాయాలు సహజమేనని, అయితే వాటిని రాజకీయంగానే ఎదుర్కోవాలే తప్ప వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ--యాదవ సమాజానికి చెందిన మహిళా నాయకురాలిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు ఆమె ఒక్కరినే కాకుండా యాదవ సమాజ ఆత్మగౌరవాన్ని, బీసీ మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.శివ చరణ్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ఈశ్వరమ్మ యాదవ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని హరిబాబు యాదవ్ డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకు ఒక హద్దు, సంస్కారం ఉండాలని, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు.

అలాగే, క్షమాపణ చెప్పకుండా ఇదే ధోరణిని కొనసాగిస్తే యాదవ సంఘాలు, బీసీ సంఘాలు, మహిళా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు చట్టపరమైన చర్యలకు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. యాదవుల ఆత్మగౌరవం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, మహిళల గౌరవాన్ని కించపరిచే రాజకీయ సంస్కృతిని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని నూనె హరిబాబు యాదవ్ పిలుపునిచ్చారు.

# మున్సిపల్ బాగోతం ఇలా కూడా ఉంటుందా..?

**డబ్బులు ఇస్తే ఏ పనైనా చేస్తారా..?**

**పైసలిస్తే కావాల్సిన పత్రాలు వచ్చినట్లేనా..?**


OFFICE OF THE MUNICIPAL COUNCIL - SATHUPALLI

From
Municipal Commissioner,
Sathupalli

To
The O/o TSNPDCL,
Sathupalli.

Rc.No :-A1/1579/2019 Dt: 12/2019

NO OBJECTION CERTIFICATE

This is to certified that the house bearing No............ is in situated Rajiv Colony in Sathupalli Municipality the Name of Smt/ Sri Mallepulla Vas kumar, S/o Jaggaiah as per this office present record.

The certificate is issued for the purpose of domestic power supply to the above said house.

COMMISSIONER,
MUNICIPALITY SATHUPALLI
KHAMMAM DIST. T. S.

Certified
Load: 3000w
Cat: I
Mallepulla Vas kumar, S/o jaggaiah.

**సత్తుపల్లి, ఆర్ సి,జులై 15 (తెలుగుగళం) న్యూస్:**

సత్తుపల్లి మున్సిపాలిటీలో డబ్బులు ఇస్తే ఏ పనైనా సులభంగా జరిగిపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని రాజీవ్ కాలనీలో గల 342వ ఫ్లాట్‌కు సంబంధించిన వ్యవహారం ఇందుకు నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్థానికుల కథనం ప్రకారం, 342వ ఫ్లాట్‌కు బుద్ధా జయమ్మ పేరిట పట్టా ఉండగా, ప్రస్తుతం అందులో మరొకరు నివాసం ఉంటున్నారు. ఇదే ఇంటికి విద్యుత్ మీటర్ మంజూరు కోసం మున్సిపాలిటీలో అభ్యంతరం లేదని ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) కోసం దరఖాస్తు చేయగా, అధికారులు ఎన్‌ఓసీ జారీ చేసి విద్యుత్ మీటర్ మంజూరు చేయించినట్లు సమాచారం.అయితే ఆ ఎన్‌ఓసీ పత్రంలో అనేక అక్షరదోషాలు, వివరాల్లో పొరపాట్లు ఉండటమే కాకుండా, అధికారిక పత్రంగా ఉండాల్సిన ప్రమాణాలు పాటించలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, అదే పత్రం ఆధారంగా జీవో నంబర్--58 ప్రకారం రిజిస్ట్రేషన్ కూడా జరిగినట్లు సమాచారం.మరోవైపు, సంబంధిత ఇంటికి ఇప్పటివరకు నీటి పన్ను, ఇంటి పన్ను చెల్లించిన రికార్డులు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.డబ్బులు చెల్లించిన వారికి మాత్రమే నిబంధనలకు విరుద్ధంగా సేవలు అందుతున్నాయా? ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీసి, తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గమనిక: పై కథనంలోని ఆరోపణలు స్థానికుల వాదనల ఆధారంగా రూపొందించబడినవి. సంబంధిత మున్సిపల్ అధికారుల స్పందన అందుబాటులోకి వచ్చిన వెంటనే ప్రచురించడం జరగవచ్చు.

# మూగజీవాల మందులు మట్టిపాలు చేస్తున్న అధికారులు

## సీపీఐ నాయకుల ఆరోపణలు




**తెలుగు గళం న్యూస్ జాఫర్‌గడ్, జులై 15**

జనగామ జిల్లా జాఫర్‌గడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో భారీ మొత్తంలో గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులను బస్తాల్లో నింపి మట్టిపాలు చేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎం.డి. యాకూబ్ పాషా ఆరోపించారు.వారు మాట్లాడుతూ, పశువులకు సకాలంలో అందించాల్సిన మందులను గ్రామీణ ప్రాంతాల్లో వినియోగించకుండా నిర్లక్ష్యంగా నిల్వ ఉంచడం వల్ల లక్షల రూపాయల విలువైన మందులు గడువు ముగిసి వృథా అయ్యాయని విమర్శించారు. ఇది స్థానిక పశు వైద్యుని నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.ఒకవైపు పశువైద్య మందుల కొరత ఉందని చెబుతుండగా, మరోవైపు భారీ మొత్తంలో మందులు మట్టిపాలు కావడం వైద్యశాఖ పనితీరుపై అనుమానాలు కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్యుడు సకాలంలో అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు, పశుపాలకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ నిర్వహించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.లేకపోతే పశువైద్యశాల ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## తాడిచర్ల--2 బొగ్గు బ్లాకు లీజు సాధనతో సత్తుపల్లి సింగరేణిలో సంబరాలు”

### 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. కార్మికుల్లో హర్షాతిరేకాలు”









**సత్తుపల్లి,ఆర్ సి,జూలై15(తెలుగుగళం) న్యూస్ :** సింగరేణి చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిన తాడిచర్ల--2 బొగ్గు బ్లాకు గనుల లీజు సాధన సందర్భంగా సత్తుపల్లి ఏరియాలో బుధవారం విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ, ప్రజా ప్రభుత్వ నిరంతర కృషితో 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బొగ్గు బ్లాకు లీజు మంజూరు కావడంతో సింగరేణి వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

ఉదయం విధుల ప్రారంభ సమయంలో జేవీఆర్ బహిరంగ గని, జేవీఆర్ బొగ్గు నిర్వహణ కేంద్రం, కిష్టారం బహిరంగ గని, జేవీఆర్ వైద్యశాలలో కార్మికులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. జేవీఆర్ బహిరంగ గనిలో ప్రాజెక్టు అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా ప్రధాన మహా ప్రబంధకుడు చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీఆర్ బొగ్గు నిర్వహణ కేంద్రంలో భూక్యా రాంబాబు అధ్యక్షతన ఏరియా ఇంజనీరు సోమశేఖరరావు, కిష్టారం బహిరంగ గనిలో ప్రాజెక్టు అధికారి ఎల్.ఎ.ఎస్.వి. సునీల్ వర్మ అధ్యక్షతన ప్రధాన మహా ప్రబంధకుని ప్రత్యేక అధికారి బొల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు. జేవీఆర్ వైద్యశాలలో డాక్టర్ బి. నరసింహారావు అధ్యక్షతన వైద్య సిబ్బంది వేడుకలను నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి ప్రధాన మహా ప్రబంధకుని కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో విజయోత్సవ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు పంపిన ప్రత్యేక సందేశాన్ని అధికార యంత్రాంగం చదివి వినిపించింది. అనంతరం కార్మికులకు ఉప ముఖ్యమంత్రి సందేశంతో కూడిన కరపత్రాలు, మిఠాయిలను పంపిణీ చేశారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాకు ద్వారా ఏటా 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి 45 సంవత్సరాల పాటు కొనసాగి సింగరేణికి ఉజ్వల భవిష్యత్తును, తెలంగాణకు ఇంధన భద్రతను కల్పిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కోయగూడెం, సత్తుపల్లి ప్రాంతాలకు చెందిన మరిన్ని బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు

## రూ.2 కోట్లతో ఆధునిక బహిరంగ క్రీడా ప్రాంగణం”

### జేవీఆర్ డిగ్రీ కళాశాలలో స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్”





**సత్తుపల్లి,ఆర్ సి,జూలై15(తెలుగుగళం) న్యూస్ :** సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక బహిరంగ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డితో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు.

బహిరంగ క్రీడా ప్రాంగణం నిర్మాణానికి సంబంధించి అధికారులు స్థల కొలతలు చేపట్టగా, ప్రాంగణ నిర్మాణంలో క్రీడాకారులకు ఉపయోగపడేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ పలు సూచనలు చేశారు.

అనంతరం జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని వ్యాయామ పరికరాలను పరిశీలించిన వారు, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో బహిరంగ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి యువతకు, క్రీడాకారులకు మరింత ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

## పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు, నర్సుల ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి”

### సీపీఎం బృందం ఆసుపత్రి సందర్శన.. ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శ”








**సత్తుపల్లి/పెనుబల్లి జూలై 15 (తెలుగుగళం) న్యూస్ :** పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావుతో పాటు మండల కమిటీ సభ్యుల బృందం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించింది.

ఈ సందర్భంగా ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల ప్రధాన వైద్యుడు డాక్టర్ కే. కిరణ్‌కుమార్ను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది కొరతపై చర్చించారు.

ఈ సందర్భంగా ప్రధాన వైద్యుడు మాట్లాడుతూ, ఆసుపత్రిలో 20 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గైనకాలజీ విభాగంలో మహిళలు, గర్భిణీలకు నిరంతర వైద్య సేవలు అందిస్తున్నామని, అలాగే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధుల నిర్ధారణకు రక్త పరీక్షలు, ప్లేట్‌లెట్స్ కౌంటింగ్ వంటి పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. నర్సింగ్ సిబ్బంది కూడా 12 మంది ఉండాల్సి ఉండగా సగం మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

ఈ సందర్భంగా చలమాల విటల్‌రావు మాట్లాడుతూ, రోజూ సుమారు 500 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం ఆసుపత్రికి వస్తున్నప్పటికీ తగినంత మంది డాక్టర్లు, నర్సులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలోకి వైద్య సేవలను మార్చినప్పటికీ అవసరమైన వైద్య సిబ్బందిని నియమించకపోవడం ప్రభుత్వ ప్రజారోగ్యంపై నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో: సీపీఎం మండల కమిటీ సభ్యులు నల్లమల అరుణ ప్రతాప్, కండే సత్యం, చిలకా రామచంద్రు, తడకమళ్ల చిరంజీవి, వడ్డేపల్లి రవీంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హసన్‌పర్తిలో అక్రమ రేషన్ బియ్యం నిల్వలపై పోలీసుల దాడి

### 7 క్వింటాళ్ల 50 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం -- నిందితుడిపై కేసు నమోదు

**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/హసన్‌పర్తి, జూలై 15**



హన్మకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.బుధవారం నిర్వహించిన దాడిలో మొత్తం 7 క్వింటాళ్ల 50 కిలోల రేషన్ బియ్యం పట్టుబడగా, దీని విలువ సుమారు రూ.21 వేలగా అంచనా వేశారు.హసన్‌పర్తి హెడ్ కానిస్టేబుల్ డి. యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం, ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, పోలీసు సిబ్బంది పి. ధనుంజయ్య, ఎం. భరత్‌లతో కలిసి ఎల్లాపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దండుగుల రమేష్ ఇంటి సమీపంలోని ఓ షెడ్డులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందింది.దీంతో ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో పోలీసులు షెడ్డుపై దాడి చేసి తనిఖీలు నిర్వహించగా, 16 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల 50 కిలోల పీడీఎస్ బియ్యం లభ్యమైంది. అక్కడే ఉన్న దండుగుల రమేష్ (42), ఎల్లాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి కిలో రూ.10 చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, కిలో రూ.30 చొప్పున విక్రయించేందుకు నిల్వ ఉంచినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పంచనామా నిర్వహించి స్టేషన్‌కు తరలించారు.నిందితుడిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ మహేందర్

ఈ సందర్భంగా హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని కొందరు స్వార్థపరులు తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం చట్టవిరుద్ధమని అన్నారు. అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదల కోసం ఉద్దేశించిన రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## కాకర్లపల్లి ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి”

### ఉపాధ్యాయుల నియామకం, తరగతి గదులు, గ్రంథాలయ గది ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల డిమాండ్”





**సత్తుపల్లి,ఆర్ సి,జూలై15(తెలుగుగళం) న్యూస్ :** కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే అనంతరం ప్రజాసంఘాల నాయకులు జాజిరి శ్రీనివాస్, జాజిరి జ్యోతి, కువారపు లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాలలో కంప్యూటర్ బోధకుడు, శాశ్వత ఆంగ్ల ఉపాధ్యాయుడిని తక్షణమే నియమించాలని కోరారు.

పాఠశాల ప్రారంభమై నెలరోజులు గడిచినా విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫాంలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో 11 కంప్యూటర్లు ఉన్నప్పటికీ కంప్యూటర్ బోధకుడు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడం లేదని, అదనంగా మూడు తరగతి గదులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయం ఉన్నప్పటికీ ప్రత్యేక గ్రంథాలయ గది లేకపోవడం విచారకరమని, వెంటనే లైబ్రరీ గదిని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఆడ విద్యార్థినులకు ప్రతి నెల శానిటరీ ప్యాడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, మినీ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాల సమయంలో పాఠశాల ఆవరణలో నీరు నిలిచి బురదగా మారుతున్నందున మొరం పోసి మైదానాన్ని చదును చేసి విద్యార్థులు ఆటపాటలకు అనువుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం నాయకులు బండి వేలాద్రి, దాట్ల రాంబాబు, కొప్పుల చిన్నస్వామి, ఆంగోతి చిట్టెమ్మ, శైలజ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసిన హసన్‌పర్తి పోలీసులు




**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/హసన్‌పర్తి, జూలై 15**

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందజేయడంలో హసన్‌పర్తి పోలీసులు మరోసారి విజయాన్ని నమోదు చేశారు.హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బుధవారం బాధితులకు అధికారికంగా అప్పగించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వ అధికారిక సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో నమోదు చేశారు.అనంతరం ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబర్లను బ్లాక్ చేసి సాంకేతిక నిఘా ద్వారా ఫోన్ల ఆచూకీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ వాటి అసలు యజమానులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి భద్రంగా అందజేశారు.తమ పోయిన ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు ప్రతిని ఆధారంగా సంచార్ సాథి వెబ్‌సైట్‌లోని సీఈఐఆర్ ద్వారా ఫోన్ వివరాలను బ్లాక్ చేయాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల పోయిన ఫోన్‌ను ఇతరులు దుర్వినియోగం చేయకుండా నిరోధించడంతో పాటు, పోలీసులు సులభంగా ట్రాక్ చేసి రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ క్రైమ్ టీమ్ సభ్యులు ఎ. వెంకట్, తిరుపతి, సీఈఐఆర్ ఆపరేటర్లు పూర్ణాచారి, సోమన్న, గీత, ప్రణవి, పోలీసు సిబ్బంది మరియు బాధితులు పాల్గొన్నారు.

## తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ భట్టు రమేష్

**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, జూలై 15**



తెలంగాణ ప్రభుత్వం తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ భట్టు రమేష్ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రొఫెసర్ భట్టు రమేష్ తక్షణమే తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.డిప్యుటేషన్ ప్రాతిపదికన ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.అలాగే, సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ భట్టు రమేష్‌ను వెంటనే రిలీవ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.తెలుగు భాష, సాహిత్యం, జానపదం, సంస్కృతి, చరిత్ర రంగాల్లో విశేష పరిశోధనలు, రచనలు చేసిన ప్రొఫెసర్ భట్టు రమేష్‌కు విద్యా, సాహిత్య రంగాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది.ఆయన నియామకంతో తెలుగు అకాడమీ కార్యకలాపాలు మరింత విస్తృతంగా సాగడంతో పాటు తెలుగు భాషాభివృద్ధి, పుస్తక ప్రచురణలు, పరిశోధన కార్యక్రమాలకు కొత్త ఊపు వస్తుందని విద్యావేత్తలు, సాహితీవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## డీలిమిటేషన్ బిల్లుపై నిర్ణయం తీసుకోలేదు: సుప్రియా సూలే



**తెలుగు గళం:** డీలిమిటేషన్ బిల్లుపై తమ పార్టీ ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న ప్రచారం “టీకప్పులో తుపాను” లాంటిదేనని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమికి తాము మద్దతు ఇవ్వనున్నట్లు వస్తున్న వార్తలను కొట్టిపారేశారు. ఓ జర్నలిస్టు, స్నేహితుడితో తన వాట్సప్‌లో జరిగిన వ్యక్తిగత సంభాషణను పార్టీ అధికారిక అభిప్రాయంగా ప్రచారం చేయడం సరికాదని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని.. వాటికి అన్యాయం జరగకూడదని పార్టీ భావిస్తోందని ఆమె తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచి, దానిని ఎలా అమలు చేస్తారో అధికారికంగా వెల్లడిస్తే, నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇచ్చే విషయాన్ని తమ పార్టీ పరిశీలిస్తుందని చెప్పారు. బిల్లును చూడకుండానే స్పందించడం సరికాదన్నారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.